క్లుప్తంగా

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన శివగంగ రాజరాజేశ్వర ఆలయం

మహేశ్వరం: పట్టణంలోని శివగంగ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరీ దేవి శరన్నవరాత్రోత్సవాలు అక్టోబర్ 15 నుంచి 24వ తేదీ మంగళవారం వరకు అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో జరగనున్నాయి. ఉత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్ గౌడ్ పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై.. రాజరాజేశ్వరీ దేవి, రాజరాజేశ్వరుడు (శివుడు)కి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, కుంకుమార్చనలు పలు పూజ కార్యక్రమాలు చేసి భక్తులు మొక్కులను తీర్చుకోవాలని కోరారు.

వైభవంగా పల్లకీ సేవ



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శమిచ్చిన స్వామి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగుట్ట లక్ష్మి నరసింహాస్వామి ఆలయంలో శనివారం వైభవంగా అమావ్యాస పల్లకి సేవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాలకు ప్రత్యేక పూజులు చేసి.. ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు నక్షత హారతి దర్శనాన్ని కల్పించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శివశంకర్, పూజారులు అజయ్ శర్మ, మురళీశర్మ, పాలక మండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధం



తుక్కుగూడలో ఏర్పాట్లు చేసిన మండపం

తుక్కుగూడ: విజయదశమి పురష్కరించుకొని దేవి శరన్నవరాత్రి వేడుకల నిర్వహణ ఉత్సవ కమిటీ సభ్యులు సిద్ధమవుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని తుక్కుగూడ, రావిర్యాల, మంఖాల్, ఇమామ్‌గూడ, సర్దార్‌నగర్ తదితర గ్రామాల్లో ఇప్పటికే మండపాలను ఏర్పాటు చేశారు. అత్యంత సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. నేడు అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి.. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసుకుంటున్నారు.

సాధనకు మించిన మార్గం లేదు



భక్తులకు ప్రవచనాలు వినిపిస్తున్న గురూజీ

కందుకూరు: ఆధునిక సమాజంలో ఆటుపోట్లను తట్టుకుని నిలబడాలంటే సాధనకు మించిన మార్గం మరొకటి లేదని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి వ్యాఖ్యానించారు. శనివారం అమావాస్యను పురస్కరించుకుని మండలంలోని పులిమామిడి పరిధిలోని నిఖిల్ చేతనా కేంద్రంలో గురూజీ ఆధ్వర్యంలో ఘనంగా హోమాన్ని నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు ఆశీర్వాదాలు అందించి ప్రవచనాలు చేశారు. సందర్భంగా ఆయన అనిల్‌కుమార్‌జోషి మాట్లాడుతూ ప్రతి నిత్యం సాధనతో భగవంతుడి కృపకు పాత్రులు కావచ్చని అన్నారు. ఈ సన్మార్గంలో నడుస్తూ తోటివారికి సహాయపడాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామానికి చెందిన రవీందర్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు దాడిచేసి గాయపరిచారు. విషయం తెలియడంతో శనివారం ఉదయం రవీందర్‌ను ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు సురేందర్‌రెడ్డి ఉన్నారు.

అఖిలాండ కోటి బ్రహ్మోత్సవం



బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం



కోనేరు గట్టున కాలేయ మర్దిని విగ్రహం

- స్వయం భూగా వెలిసిన వేంకటేశ్వర స్వామి
- భక్తుల పాలిట కొంగు బంగారం
- వందల ఏళ్ల చరిత్ర ఆలయ సొంతం
- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పహాడీషరీఫ్: చుట్టూ పంట పొలాలు.. కొండలు.. గుట్టలు.. కోనేరుల నడుమ ప్రశాంత వాతావరణంలో మామిడిపల్లి శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి కొలువుదీరారు. కోరిన కోరికలు తీర్చుతూ భక్తుల పాలిట కొంగు బంగారంలా విరాజిల్లుతున్నారు. మామిడిపల్లికి కిలోమీటర్ దూరంలో ప్రాచీన కట్టడంగా ఉన్న ఈ ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర సొంతం. రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం ఆలయం, అమ్మపల్లి, మామిడిపల్లి ఆలయాలు ఒకేసారి కట్టినట్లు కథనం ప్రాచుర్యంలో ఉంది. అక్కన్న మాదన్నల హయాంలో నిర్మించిన ఈ ఆలయం నిజాం నవాబుల కాలంలో ప్రధానిగా ఉన్న మహారాజా కిషన్ పరిషాద్ పర్యవేక్షణలో కొనసాగేదని భక్తులు చెబుతున్నారు.

దేవుడిగుట్టగా ప్రసిద్ధి

పూర్వం వెయ్యేళ్ల క్రితం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి మామిడిపల్లి శివారులోని కొండపై స్వయం భూగా వెలిశారు. కాలక్రమేణా కొండపై పూజా కైంకర్యాలు చేసేందుకు వీలులేకుండా దట్టమైన అడవి ఉండడం.. అక్కడ ఆలయ నిర్మాణం కూడా ఇబ్బందిగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రాంతాన్ని పాలించే రాజుకు స్వప్నంలో కొండకు ఎదురుగా ఆలయ నిర్మాణం చేపట్టాలని స్వామి వారు సాక్షాత్కరించారని, ఇందులో భాగంగానే కొండకు ఎదురుగా ఈ ఆలయాన్ని నిర్మించారనే ప్రచారం ఉంది. ఇప్పటికీ కొండపై ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ఈ కొండను కూడా దేవుడిగుట్ట అని భక్తులు పిలుస్తుంటారు.

ఆకట్టుకుంటున్న శిల్పాలు

శ్రీ బాలాజీ వేంకశ్వర స్వామి ఆలయం నాటి శిల్ప కళా వైభవానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. పూర్తి రాతి కట్టడంతో కట్టిన ఈ ఆలయ నిర్మాణం భక్తులను ఇట్టే కట్టి పడేస్తుంది. గర్భగుడిలో నల్లరాత్రి విగ్రహంతో ఉన్న స్వామి వారికి కుడి వైపున శ్రీదేవి, ఎడమ వైపున భూదేవిలు కొలువుదీరారు. ఆలయ మండపాన్ని మొత్తం 30 రాతి స్తంభాలతో నిర్మించారు. గోపురంపై విశేషమైన దేవతా మూర్తులు, దశావతారాలు చెక్కబడ్డాయి. ముఖ్యంగా దేవాలయ మండపం ఎదుట రాతితో శ్రీకుర్మం (తాబేలు) ముద్రించారు. ఇలాంటి శ్రీకర్మం ప్రాచీనమైన ఆలయాలకే ప్రత్యేకంగా ఉంటుంది.

దినదినాభివృద్ధి

2020 లాక్‌డౌన్ నుంచి దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో పార్కు ఏర్పాటు, స్వాగత కమాన్, కోనేరుపై కాలేయ మర్దిని విగ్రహం, గోశాలలో శ్రీకృష్ణుడి విగ్రహం, ఆలయ ప్రాకారంపై దశావతరాల నిర్మాణం, గర్భగుడిపై ప్రాకారం నిర్మించి ఆలయాన్ని చక్కగా తీర్చిదిద్దారు. భక్తుల తాకిడి పెరిగి....దేవాదాయ శాఖకు ఆదాయం సమకూరుతోంది.

ఆరు రోజుల పాటు ఉత్సవాలు

ఈ నెల 15వ తేదీన ఆదివారం విష్వక్సేనారాధన, అంకురార్పణ, నివేదన, తీర్థప్రసాద గోష్టి కార్యక్రమాలతో ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 16న ఉదయం 7 గంటలకు బాలబోగం, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ట హవనం, ధ్వజారోహనము, నివేదన, తీర్థప్రసాద గోష్ఠి, సాయంత్రం 6 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, హవనం, దేవతాహ్వానము ఉంటుంది. 17న ఉదయం 7 గంటలకు బాలబోగం, శాంతిపాఠం, 11 గంటలకు తిరుకల్యాణ మహోత్సవం, సాయంత్రం 5 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, శేష వాహన నివేదన కార్యక్రమాలు కొనసాగుతాయి. 20వ తేదీన జరిగే చక్రతీర్థం, ధ్వజ అవరోహణంతో ఈ బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

బడంగ్‌పేట మేయర్ పారిజాత



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాత ధీమా వ్యక్తం చేశారు. శనివారం 14వ డివిజన్‌కు చెందిన పలువురు ముస్లింలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పారిజాత మాట్లాడుతూ పార్టీ ఆమోదించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలు ఇష్టపడుతున్నారని తెలిపారు. హస్తం పార్టీ అధికారంలోకి రాబోతుందని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయితీ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు రియాజ్, బాబా ఖాదర్, నూర్, అల్లావుద్దీన్, ఇమ్రాన్, షహిదా తదితరులు పాల్గొన్నారు.

సబితారెడ్డిని గెలిపించుకుందాం



అన్నోజిగూడలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి

కందుకూరు: రాబోయే ఎన్నికల్లో మహేశ్వరంలో మరోసారి మంత్రి సబితారెడ్డిని గెలిపించుకుందామని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మీర్‌ఖాన్‌పేట ఎంపీటీసీ రాములు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని అన్నోజిగూడలో స్థానిక సర్పంచ్ ఇందిరమ్మ, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జంగయ్య ఆధ్వర్యంలో సబితారెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజాసంక్షేమ పథకాలు కొనసాగాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుకు కార్యకర్తలు పనిచేయాలన్నారు. కాగా ఆ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ, మాజీ ఉప సర్పంచ్ యాదయ్య, యూత్ మండల ఉపాధ్యక్షుడు రామకృష్ణ, రమేశ్, కృష్ణ, మహేందర్, గణేశ్, మహేందర్, అంజి, నారాయణ, సురేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాయిరెడ్డిగూడలో..

సాయిరెడ్డిగూడలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, ఎంపీటీసీ ఇందిరదేవేందర్, ముచ్చర్ల సర్పంచ్ రాంచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సబితారెడ్డి గెలుపుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగయ్య, వెంకటేష్, విఘ్నేశ్వర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, కృష్ణ, గోవర్ధన్, డి.నరసింహా, చంద్రమోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసమే శంకుస్థాపనలు



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

- నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం
- సమస్యల పరిష్కారంలో సబితారెడ్డి విఫలం
- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి

మహేశ్వరం: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో మంత్రి సబితారెడ్డి విఫలమయ్యారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి చౌరస్తాలో ఎస్‌కేఆర్ హాలులో బీజేపీ మండల అధ్యక్షుడు మాధవచారి అధ్యతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రి ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. కుల సంఘాలకు అధికారికంగా పట్టా సర్టిఫికెట్లు, పత్రాలు ఇవ్వకుండా కేవలం ఓట్ల కోసం శిలాఫలకాలు వేస్తున్నారని విమర్శించారు. మండలంలో 15,500 దొంగ ఓట్లను అధికార పార్టీ నేతలు నమోదు చేయించారని ఆరోపించారు. ఈ నెల 16న బడంగ్‌పేట్ మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగే బీజేపీ బహిరంగ సభకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరవుతున్నారని, ఈ సభకు నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అనంతయ్య గౌడ్, యాదయ్య గౌడ్, వెంకటేశ్ గౌడ్, ముత్యం, పంతు నాయక్, భూపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కేసి పువ్వేసి చందమామ

మీర్‌పేట: పూలపండుగ వచ్చింది. పల్లెపట్టణం సందడిగా మారింది. తొమ్మిది రోజుల పాటు తెలంగాణలో అత్యంత పవిత్రంగా ఆరాధించే బతుకమ్మ సంబురాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు ఎంగిలిపూల బతుకమ్మతో ఆరంభమై సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంతి హిల్స్ దుర్గామాత ఆలయం, నందిహిల్స్ కాలనీలలో శనివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడారు. బతుకమ్మలను మధ్యలో ఉంచి పాటలు పాడతారు. ఒకరు పాడుతుంటే మిగతా మహిళలంతా వంత పాడారు.



బతుకమ్మతో చిన్నారి



తక్కుగూడలో..



బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న కార్పొరేటర్ ధనలక్ష్మి తదితరులు



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో..



బతుకమ్మ వేడుకలో కాలనీవాసులు



రావిర్యాలలో..

యువ ఓటర్లే కీలకం

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గంలో యువత ఓట్లే కీలకం కానున్నాయి. అభ్యర్థుల గెలుపోటములను యువ ఓటర్లు నిర్ధారించనున్నారు. నియోజకవర్గంలో 19 నుంచి 39 సంవత్సరాలు వయసు గల ఓటర్లు సగానికి పైగా ఉన్నారు. దీనితో జయాపజయాలను యువ ఓటర్లు శాసించనున్నారని పలువురు విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

మొత్తం ఓటర్లు 2,30,650

కల్వకుర్తిలో మొత్తం ఓటర్లు 2,30,650 మంది ఉన్నారు. మహిళలు 1,13,250 మంది, పురుషులు 1,17,393, థర్డ్ జెండర్ 7 మంది ఉన్నారు. ఇందులో కడ్తాల్ మండలంలో 32,019 మంది ఓటర్లు, తలకొండపల్లి మండలంలో 35,272, కల్వకుర్తి రూరల్‌లో 29,746, కల్వకుర్తి మున్సిపాలిటీలో 23,766, వెల్దండ మండలంలో 31,565, ఆమనగల్లు మండలంలో 29,941, మాడుగుల మండలంలో 41,579, చారకొండ మండలంలో 6,757 మంది ఓటర్లు ఉన్నారు.

యువ ఓటర్లే ఎక్కువ

నియోజకవర్గంలో 18 నుంచి 39 సంవత్సరాలు వయసు ఉన్న ఓటర్లు 1,20,070 మంది ఉన్నారు. ఇందులో 18 నుంచి 19 సంవత్సరాల వారి 6519 మంది ఓటర్లు, 20 నుంచి 29 సంవత్సరాల వారు 46134 మంది ఓటర్లు, 30 నుంచి 39 సంవత్సరాల ఓటర్లు 67417 మంది ఉన్నారు. దీనితో కల్వకుర్తి అసెంబ్లీ బరిలో నిలిచే అభ్యర్థుల భవితవ్యాన్ని యువ ఓటర్లు నిర్ధారించే అవకాశం ఉంది.

ఓటు నమోదుకు అవకాశం

అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. నిరంతరం ఓటు నమోదు, బదిలీ ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ నెల 4న తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది. అయినా కొత్తగా ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించింది. 18 ఏళ్లు నిండిన వారు, ఓటరు జాబితాలో చోటు దక్కనివారు ఈ నెల 31 వరకు ఓటు కోసం నమోదు చేసుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పించింది. మీ సేవా కేంద్రంలో లేదా మొబైల్ ఫోన్ ద్వారా ఫారం నంబర్ 6ను నింపి ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని కల్వకుర్తి ఆర్డీఓ శ్రీనునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

భార్యతో గొడవపడి భర్త అదృశ్యం



మోతీలాల్ బారక్(ఫైల్)

పహాడీషరీఫ్: భార్యతో గొడవపడిన ఓ భర్త కనిపించకుండా పోయాడు. ఈ ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మధుసూదన్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన మోతీలాల్ బారక్ (37) పదేళ్ల క్రితం పద్మిని మెహంతను ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే నాలుగు నెలల క్రితం మోతీలాల్ దంపతులు తుక్కుగూడకు వలస వచ్చారు. స్థానిక ఉడిపి హోటల్‌లో మోతీలాల్ సర్వెంట్‌గా పని చేస్తున్నాడు. సెప్టెంబర్ 18వ తేదీన ఉదయం భార్యతో గొడవపడి పనికంటూ బయటికి వెళ్లాడు. ఇంటికి రాకపోవడంతో ఆమె అదే రోజు రాత్రి హోటల్‌కు వెళ్లింది. అక్కడ ఉన్న సిబ్బందిని విచారించగా మోతీలాల్ పనికి రాలేదని తెలిపారు. ఆందోళన చెందిన భార్య.. స్నేహితులు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి: సీపీఐ



సడక్ బంద్‌ను నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

హయత్‌నగర్: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో టీఎస్ పీఎస్సీ విఫలమైందని, యువత జీవితాలతో ఆడుకుంటున్న కమిషన్ సభ్యులను తొలగించి వారిపై కేసులు నమోదు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నర్సింగ్‌రావు, ఆందోజు రవీంద్రాచారి డిమాండ్ చేశారు. గ్రూప్–2 అభ్యర్థి ప్రవల్లిక మృతిని నిరసిస్తూ శనివారం అఖిల పక్షం పిలుపు మేరకు హయత్‌నగర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై సడక్ బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పించడంలో, పరీక్షలు నిర్వహించడంలో, జాబ్ కేలండర్‌ను రూపొందించడంలో బోర్డు సభ్యులు విఫలమయ్యారని, వారి నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారన్నారు. ప్రవల్లిక ఆత్మహత్యకు టీఎస్‌పీఎస్సీని బాధ్యులుగా చేసి చైర్మన్, సభ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, మృతురాలి కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారం ఇవ్వాలని, ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి నిరుద్యోగికి రూ.3 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జన సమితి సభ్యుడు పల్లె వినయ్‌కుమార్, నాయకులు నాయకులు మత్యాల యాదిరెడ్డి, సామిడి శేఖర్‌రెడ్డి, హరిసింగ్ నాయక్, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, దిగోజు వేణుగోపాలచారి, పోలోజు లక్ష్మణ్, పామిడి వంశీవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వమే బాధ్యత వహించాలి'

వనస్థలిపురం: గ్రూప్–2, డీఎస్సీ అభ్యర్థి ప్రవల్లిక ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ యాదవ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పైరవీలకు కేరాఫ్‌గా మారిందని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ సకాలంలో పరీక్షలు నిర్వహించకపోవడంతో ప్రవల్లిక ఆత్మహత్య చేసుకుందన్నారు. టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలని, ప్రవల్లిక కుటుంబానికి రూ. 50 లక్షల ఆర్థిక సాయం అందించాలని, మృతురాలి కుటుంబంలో అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.